


# ఏ ఇంట్లోనైనా అమ్మ.....

మహానగరం కథలు..

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

'**అబ్బా! అప్పుడే ఏడయిపోయింది**.. ఈ బస్ తన స్టాప్‌కి చేరేసరికి ఇంకా ఎంత సేపు పడుతుందో? ఈ ట్రాఫిక్ అసలెప్పటికైనా తరుగుతుందా? రోజూ ఇదే గోల.. మున్నీ ఎప్పుడో వచ్చేసి ఉంటుంది.. లిల్లీ ఆరున్నరకల్లా వెళ్ళిపోతాను అంది.. కూరలు తరిగి, బట్టలు

మడత పెట్టిందో లేదో? వినయ్ వచ్చాడో, లేదో ? క్రికెట్ ప్రాక్టీస్ నించి.. కనీసం వాడు వచ్చేస్తే ఇద్దరూ ఉంటారు.. తను వెళ్ళడం ఒక అరగంట లేట్ అయినా పరవాలేదు.. కానీ వాడు వస్తూనే ఆకలంటాడు.. పొద్దున్న చేసిన పూరీలు బాక్స్‌లో పెట్టి టేబిల్ మీద పెట్టింది, చూసుకుంటారో లేదో?.. ఇద్దరూ కలిసి ఉంటే దేనికోదానికి కొట్టుకుంటూనే ఉంటారు. ఏం చేస్తున్నారో? శ్రీధర్ రావడం ఆలస్యం అవుతుంది అన్నారు.. ఎప్పుడొస్తారో? రాత్రికి వంట ఏమి చెయ్యాలో? ' ఇలా రకరకాలుగా సాగుతున్నాయి సునీత ఆలోచనలు..

సునీత బెంగుళూర్‌లో ఒక పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీలో ప్రాజెక్ట్ మేనేజర్‌గా పనిచేస్తోంది. భర్త శ్రీధర్ ప్రైవేట్ బాంక్‌లో మేనేజర్.. ఇద్దరివీ బిజీ ఉద్యోగాలే.. ఈ మధ్యనే ప్రాజెక్ట్ మేనేజర్ కావడం మూలాన, దానికి కావలసిన మెళకువలూ, పద్ధతులూ నేర్చుకోవడంలోనే ఆమెకి చాలా సమయం సరిపోతోంది.. సునీత చాలా కష్టపడి పనిచేస్తుంది. ఉదయం ఆఫీస్‌కి తొందరగా వెళ్ళి పని ముగించుకుని వీలైనంత త్వరగా ఇంటికి రావడానికి ఇష్టపడుతుంది.. అలా చేస్తే సాయంత్రం పిల్లలతో ఎక్కువ సేపు గడపవచ్చు, ఇంటికీ, తన హాబీ పుస్తకపఠనానికీ కొంత సమయం కేటాయించవచ్చు అని.

కానీ దాదాపు అన్ని సాఫ్ట్‌వేర్ కంపెనీలలాగానే ఆమె ఆఫీస్‌లోనూ దాదాపుగా అందరూ ఆలస్యంగా వస్తారు. దానివల్ల తను ఎంత బాగా ప్లాన్ చేసుకున్నా అప్పుడప్పుడు ఆలస్యం అవడం చాలా సాధారణం. ప్రాజెక్ట్ డెడ్ లైనులున్నప్పుడు చెప్పనే అక్కర్లేదు. అయినా వీలున్నంతవరకూ ఉద్యోగాన్నీ, ఇంటినీ సమతూకంలో ఉంచడానికే ఎప్పుడూ ప్రయత్నిస్తుంది. ఒక్కోసారి విసుగొచ్చి 'మానేస్తేనో' అనుకున్నా, తన కాళ్ళమీద తాను నిలబడాలన్న తపనా , చూస్తూ చూస్తూ ఇంత మంచి ఉద్యోగం, జీతం వదిలేసుకోవడం మంచిదా అన్న ఆలోచనా, పిల్లలచదువులకీ, కొత్తగా కొన్న ఇంటికి ఎంతో ఉపయోగం కదా అన్న భావనా.. ఇలా ఎన్నో కారణాలు.

అవుట్ సోర్సింగ్ పేరిట వస్తున్న ఈ ఉద్యోగాలలో ఎన్ని లాభాలున్నాయో అన్నే నష్టాలూనూ.. అనుకుంటుంది ఎప్పుడూ.. ఒక్క ఈ సాఫ్ట్‌వేర్ మాత్రమేనా.. ఎక్కడైనా అవుట్ సోర్సింగ్ ఉన్నదే కదా? తన చిన్నప్పుడు అమ్మ ఇంటిపని అంతా తనే చేసుకునేది.. ఊరికే గిన్నెలు కడిగి, ఇల్లు తుడిచి వెళ్ళిపోయేది సీతాలు.. ఇప్పుడు తను.. పనిమనిషి లిల్లీ చేత ఒక్క వంట తప్ప మిగతా పనులన్నీ చేయించుకోవడం లేదూ.. అది మాత్రం ఏమిటి? అనుకుంటూ ఉంటే నవ్వొచ్చింది సునీతకి.

---------

"చిన్నమ్మా! మొక్కలకి నీళ్ళు పోసే వెళ్ళు.. నిన్న కూడా సరిగ్గా పొయ్యలేదు.. ఈ రోజు ఎందుకో ఒకటే తల బద్దలయిపోతోంది, తర్వాత నా తలకి కాస్త బాం రాసి మర్దనా చెయ్యి ".. అంది భువన..

అప్పుడే పని అయిపోయిందనుకుని కొంగుతో చెయ్యి తుడుచుకోబోతున్న చిన్నమ్మ మారు మాట్లాడకుండా

'సరేనమ్మా' అని పైపు తీసి కుళాయికి తగిలించి.. తిప్పి చిన్న బంగళా ఇంటి ముందూ, వెనకా ఉన్న తోట అంతా తడిప సాగింది.

'ఇయ్యేళ పని తెమలనేలేదు.. పిల్లలొచ్చాసారో ఏటో? పెద్దది ఇంటిముందు ఊడిసిందో లేదో? రాముగాడు గంజి తాగిండో లేదో? చంటిది పడుకుందో, పెద్దోళ్ళని సతాయిస్తోందో ఏటో? ఆళ్ళ నాన్న ఏడున్నాడో? వీధి, వీధి తిరిగి ఖాళీ సిమెంట్ సంచీలు ఏరి తరవాత తిరిగి కాంట్రాక్టర్లకి అమ్మడం, సిమెంటు కలపడమూ ఇవన్నీ అయ్యాకా స్నేహితులతో కలిసి ఓ సుక్కేసుకుంటేనే గానీ ఇల్లు గురుతుకి రాదు. వచ్చాక ఏడి నీళ్ళు, ఏడి అన్నం ఉండాల్సిందే అందుకే పిల్లలకి అప్పుడప్పుడూ అమ్మగారిచ్చిన సద్దన్నం పెట్టినా ఆ డికి మాత్రం ఏడన్నమే పెడతాది.. ఈతోటేంటి? ఇయ్యాలింతపెద్దగా ఉన్నది? ఎంత పోసినా మన్నే తడవడం లేదే? అనుకుంటూ ముందుకు నడుస్తోంది.

ఏటో.. తమ పల్లెటూల్లో సుకంగానే ఉండేది.. నాలుగిళ్ళల్లో తను పాచి పని సేత్తే పదో పరకో ఇచ్చేవారు.. కడుపికి అన్నం పెట్టేవారు.. ఎవరో సెప్పారని.. పట్నం సాలా బాగుంటదని తీసుకొచ్చి ఈమహానగరంలో పడేశాడు.. ఇక్కడ ఒక్క గదికే వెయ్యి

రూపాయల బాడిగా, పొద్దున్నే లగిసి పంపు దగ్గిర నీళ్ళు తెచ్చుకోవాలి.. ఉన్న పది వాటాలకీ వాటాకి వంద చొప్పున కరంటూ, నీల్లకి. పిల్లల బడికి ఫీజులూ.. అక్కడైతే పంతులమ్మ ఊరికే సెప్పేది.. ఇక్కడకొచ్చి తప్పేసేసినామో, రైటే సేసినామో తెలవడం లేదు. పైగా ఇక్కడ అయ్యగోరికి కొత్త స్నేహితులూ, అలవాట్లూ. ఇంటిసంగతి కంటే టీ మీదే దాస ఎక్కువయింది అనుకుంటూ నిట్టూర్చింది..

-------------

అందమైన గ్లాస్ కేబిన్ లో కూర్చుంది. మేనేజింగ్ డైరెక్టర్ విభావరి. ఎదురుగా ఉన్నారు ముగ్గురు డైరెక్టర్లు. స్ట్రేటజీ మీటింగ్. తొలిదశ..

‘ ఈ మీటింగే ఇంత సేపా? ఒకరు చెప్పింది ఒకరు వినరు. అందరినీ ఒప్పించి ఒక త్రాటి మీదకి తీసుకుని వచ్చేసరికి ఎంత సేపు పడుతుందో? వచ్చేసంవత్సరానికంతా కావలసిన నిర్ణయాలూ, ప్రణాళికలూ, జమా ఖర్చులూ నిర్ణయించే ముఖ్య సమావేశానికి సరిపడా సమాచారాన్ని, ఆలోచనలనీ అందించవలసిన టీం తమది.. ఇది కనీసం ఇలా రెండు రోజులు సాగితే కానీ ఓ కొలిక్కి రాదు. ‘ మనసులోనే నిట్టూర్చింది.

‘ పాప ఏం చేస్తోందో ఇంట్లో? ఆయా ఉంది, అత్తగారు ఉన్నారు. మరో ముగ్గురు పనివాళ్ళున్నారు.. అయినా సరే విభావరి మనసంతా తన పదినెల్ల కూతురి మీదే ఉంది. ఈ పాటికి సాయంత్రం నిద్ర అయి ఉంటుంది. డైపర్ గంట గంటకీ మార్చమని చెప్పింది.. రోజుకి కనీసం నాలుగు సార్లు ఫ్రెష్ చేసి బట్టలు మార్చమంది.. నాలుగు సార్లు తినడానికి ప్రత్యేకంగా నాలుగు వెండి గిన్నెలూ, ప్లేట్లూ, చెంచాలూ కొంది. ఇంక బొమ్మలు సరేసరి. అన్నీ అత్తగారు జాగ్రత్తగా చూస్తారు. ‘ అయినా ఆమె ఆత్రుత ఆమెది.

పొద్దున్నే ఒక గంట పాపతో ఆడుకుని పది గంటలకి వస్తుంది విభ. ఎందుకంటే ఆమెకి తెలుసు రావడమే తన చేతిలో ఉంటుంది.. వెళ్ళడం ఎప్పుడూ చెప్పలేదు.. ఎంత తమ కంపెనీ అయినా ఏ మాత్రం అజాగ్రత్త కూడని బాధ్యతతో కూడిన పదవులు తమవి.. భర్త రాజీవ్ కూడా వ్యాపారాన్ని పెంచడానికే మరో బిజినెస్ వెంచర్ కోసం వెళ్ళాడు. ఊరిలోనే అయినా అన్నీ అయ్యేసరికి ‘ ఏ వేళవుతుందో చెప్పడం కష్టం ‘ అన్నాడు.. జర్మనీకి చెందిన ఒక మాడ్యులర్ కిచెన్ కంపెనీ తమకి ఔట్ సోర్స్ చేసే పనిమీద ఇక్కడకి వచ్చారు. ముందు వారితోనూ, తర్వాత నగరంలో చాలా పేరున్న రుగురు బిల్డర్స్ తో కలిసి ఒప్పందం చేసుకోవాలని రాజీవ్ లోచన.. అలా ఒక చేత్తో పని దొరకగానే కస్టమర్స్ దొరికినట్టుగా ఉంటుందని..

-----------------

ట్రాఫిక్ అంతరాయాలనీ, సిగ్నల్స్‌నీ దాటికుంటూ మెల్లగా సునీతని ఆమె బస్ స్టాప్‌లో దింపింది ఆఫీస్ బస్. అక్కడనించి కనీసం ఏడు నిమిషాల నడక ఇంటికి. పరుగులాంటి నడకతో వచ్చి పడింది ఇంటికి. దాదాపు ఎనిమిదవుతోంది టైము.

లిల్లీ ఎప్పుడో వెళ్ళి పోయింది అని తెలుస్తోంది. సోఫాలో టవల్, కింద బూట్లూ, పక్కనే పడేసిన సాక్స్.. షూ రాక్ దగ్గర పడేసి ఉన్న క్రికెట్ కిట్టూ.. టేబిల్ మీద పూరీలు తినేసినట్టున్నారు.. ఖాళీ డబ్బాలు.. ఫ్రిజ్ బాటిల్ సగం తాగిన నీళ్ళతో మూతలు తీసేసి ఉన్నాయి.. మున్నీ స్కూల్ డ్రెస్ దానిమంచం మీద.. చెప్పలేనంత కోపం, నీరసం వచ్చాయి సునీతకి..

‘ పెద్దపిల్లలవుతున్నారు, కనీసం ఇంత చిన్న పనులు కూడా చేసుకోలేరా? కబుర్లు మాత్రం చెప్తారు పెద్ద.. అయినా శ్రీధర్ ని అనాలి.. వీళ్ళనేమీ అనకు సునీ, పాపం హాస్టల్‌కి వెలితే అన్నీ ఎలాగూ చేసుకుంటారు కదా అని వెనకేసుకురావడం.. ఇంట్లోనే ఏమీ చేసుకోని వాళ్ళు బయటకు వెళ్ళి ఏం ఉద్ధరిస్తారు? ‘అనుకుంది దిగులుగా. కోపం ఎప్పుడూ పెద్దగా బయటకి చూపించే తత్వం కాదు – ఆమెది.

" మున్నీ, విన్నీ " పిలిచింది గట్టిగా.. బాత్ రూం లోంచి ఒకరూ, కిచెన్ లోంచి ఒకరూ.

" యా మా " అన్నారు.

" ఏం చేస్తున్నారు? ఇదసలు ఇల్లేనా? " అంది..

" ఓ మా.. అప్పుడే మొదలు పెట్టావా? " అంటూ వచ్చింది మున్నీ.. చేతిలో కప్పునిండా బూస్ట్, చక్కెర.

" ఏం చేస్తున్నావు కిచెన్‌లో? " అంది సునీత.

" నేను బూస్ట్ తాగను.. తింటాను.. " అంది.

" రెండంటిస్తాను " అంది సునీత.

" నువ్విప్వలేవుగా... " అని పరిగెత్తింది తన రూం లోకి.

ఎక్కడ మొదలుపెట్టాలో తెలియని పనికి హాల్ లోంచి శ్రీకారం చుట్టింది.. బట్టలూ ,పేపరూ చెప్పులూ సర్ది, డైనింగ్ టేబిల్ మీద వస్తువులు సర్దేసరికి పావుగంట పట్టింది. తర్వాత పిల్లల గది, కిచెన్.. గబగబా అన్నీ ముగించుకుని వంటలోకి దిగింది.

"విన్నీ, మొక్కలకి నీళ్ళు పొయ్యి, అంది కుక్కర్ పెడుతూ.. రోజూ నేనేనా? ఈరోజు దాన్ని పొయ్యమను.. ఊరికే కూర్చుని గేం బోయ్ ఆ డుతోంది.. " కోపంగా అన్నాడు.

" చూడమ్మా, ఎలా అంటున్నాడో? రోజూ పాలకోసం కూపన్ బేగ్ లో పెట్టి ఎవరు పెడతారు ? నేను పెట్టకపోతే నీకు తాగడానికి పాలే ఉండవు తెలుసా? అప్పుడు చూస్తాను క్రికెట్ ఎలా డతావో? "

మున్నీ తక్కువేమీ తినలేదు.

" అబ్బా! మీకు చెప్పాను చూసారా? అది నా తప్పు.. " అంటూ కూర మూకుడు లో వేసి మూత పెట్టి మొక్కలకి నీళ్ళు పోసి వచ్చింది.

' ఇందాకా బాత్ రూం లు చెక్ చెయ్యనే లేదు' అనుకుంటూ రెండు బాత్ రూం లూ సర్ది వచ్చింది.. " పొద్దున్న లేస్తే అందరం బయటకి వెళ్ళిపోతాం, ఇప్పుడు సర్దుకోకపోతే ఏం? " అంది కూతురు పెద్ద ఆరిందాలా.

" అవున్నిజమే, నీ అంత తెలివి నాకు లేదు కదా, మనం ఇంట్లో ఉన్నంతసేపయినా ఇల్లు నీట్‌గా ఉండాలని నా తాపత్రయం " అంది విసుగ్గా.

"అబ్బా, అన్నం వండుతున్నావా? కుక్కర్ సౌండ్ వస్తోంది.. నాకు అన్నం బోరమ్మా, నేను తినను.. " సోఫా లో కాళ్ళు చాపుకుని చెప్తున్నాడు కొడుకు.

" ఈ రోజు నాకు లేట్ అయింది విన్నీ, ఇప్పటికి చేసింది తినేయడమే.. రేపు చూద్దాం లే".. అంది సాంబార్ లో పోపు వేసి, అప్పడాలు వేయించింది.. వినయ్‌కి అప్పడాలుంటే అన్నం మీద అలక కొంచం తగ్గుతుందని తెలుసు.

వంట పూర్తి అయ్యాకా, స్నానం చేసి, ' ఇంటికి వచ్చిన అంత సేపటికి ఒక ఐదు నిమిషాలు కూర్చునే అవకాశం దొరికింది ' అనుకుంటూ మంచం మీద కూర్చుని ఫాన్ వేసుకుని టవల్ తో మెడ, ముఖం తుడుచుకుంటూ ఉండగానే ఇద్దరూ తయారు..

" అమ్మా, ఆకలి " అంటూ.

"అప్పుడేనా? నాన్న వచ్చేవరకూ ఆగరూ? ".. అని "వద్దులెండి.. లేట్ అవుతుందన్నారు.. " అంది ముగ్గురూ టేబిల్ దగ్గరకి వెళ్ళారు.

--------------

"అమ్మా, పని అయిపోయింది.. నే పోతన్నా, పిల్లలెదురుసూత్తంటారు" అనుకుంటూ పరిగెత్తింది చిన్నమ్మ అమ్మగారిచ్చిన రొట్టెలు, కూరా పట్టుకుని. ఆదరాబాదరాగా పరిగెడుతోంది చిన్నమ్మ. "చంద్రమ్మా, రామూ" అని పిలిచింది. ఉన్న ఒక్క గది తలుపు దగ్గరగా వేసి బయట కూర్చుని ఉంది చంద్రి, పెద్దది.

"రాము గాడేడే? " అంది.

"గోలీలాడబోయిండు.. " అంది చంద్రి కోపంగా.." సంటిని ఎప్పుడూ నేనూ సూస్కోవాల్నా?, నేనాడుకోవద్దా? "అంది.

"ఎవ్వరూ సూస్కోపోతే ఎలాగే తల్లీ, నేను నాలిగిళ్ళకి పోవాల్నా వద్దా,? " అంది నవ్వుతూ.

"రొట్టె తిను" అని దాని చేతిలో రెండు రొట్టెలూ, దాని మీద కూరా పెట్టి ఇచ్చింది.. అది ఆవురావురు మంటూ తింటూ ఉంటే, " పొద్దున్నెప్పుడుతిందో బిడ్డ" అనుకుంది.

పొద్దున్నే ఐదు గంటలకే నిద్ర లేచి పక్కనున్న అపార్ట్‌మెంట్లో మూడిళ్ళల్లో పని ముగించుకుని ఏడున్నరకొస్తుంది చిన్నమ్మ ఇంటికి. గబగబా తోచినది వండి పెట్టి పెద్దపిల్లలనిద్దరినీ స్కూల్‌కి పంపుతుంది. తర్వాత మూడింటింకి చంద్రి వచ్చాకా మళ్ళీ చంటిని దానికప్పగించి రింటిదాకా బంగళాలో పని చేస్తుంది. పొద్దున్నే తల్లి లేనప్పుడు, స్కూల్ నించీ వచ్చాకానూ కూడా చంటిని తనే చూసుకోవాలని విసుగు చంద్రికి.

"ఇంకా ఇంటిముందైనా ఊడవలేదా? "అని అక్కడాపిన పనిని ఇక్కడ కొనసాగించింది. ఇంటిముందు చీపురు తో ఊడ్చి, నీళ్ళు చల్లి ముగ్గేసింది.

తల్లి వచ్చినది చూసి పరిగెత్తుకుని వచ్చాడు రాము.

"అమ్మా ఆకలి "అంటూ.

" ఎదవా, అమ్మని సూత్తే అదే గుర్తొస్తది నీకు" అని వాడి చేతిలో మిగతా రెండు రొట్టెలు పెట్టింది.. మిగతా పని ముగించుకుని గది వెనక ఉన్న పొయ్యి మీద అన్నం వండింది. పుల్లటి చారు పెట్టి, చింతతొక్కు నూరింది.. అమ్మగారిచ్చిన కూరట్టే పెట్టింది.. రెండే గుడ్లుంటే పులుసు పెట్టింది.

----------------

"ఐ థింక్ వి షుడ్ కాల్ ఇట్‌ఏ డే. " అంది విభావరి.. దాదాపు ఎనిమిదింటికి.

" ష్యూర్.. మిగతాది రేపు చూద్దాం.. "

"ఈ రోజు యాక్షన్ ఐటెంస్.. దాని ఓనర్స్ "అని లిస్ట్ రాసి అందరికీ మెయిల్ పంపించింది.

లాప్‌టాప్, బాగ్ సర్దుకుని కార్‌లో వచ్చి కూర్చుంది.

"ఇంటికి రాజూ".. అంది.

" సరే మేడం." గేర్ మార్చి మెత్తగా ముందుకి నడిపాడు.

ఇంటికి ఫోన్ చేసి అత్తగారితోటీ, ఆయా తోటీ మాట్లాడింది.. పాప ఇప్పుడే భోంచేసింది.. స్నానం చేసి ఆడుకుంటోంది అని.. రాజీవ్ ఇంకా రాలేదని.. తెలిసింది.

రాజీవ్ కి ఫోన్ చేసింది.

"కొత్త డీల్ కోసమే విండ్సర్ లోనే ఉన్నాము. బహుశా డిన్నర్ ఇక్కడే అవుతుంది.. నువ్వింటికెళ్ళిపో.. మరో గంటన్నరలో వచ్చేస్తాను "అన్నాడు అతను.

అలసటగా కళ్ళు మూసుకుని సీట్ మీద తల వాల్చింది. అరగంటలో ఇల్లు చేరింది.

--------

అన్నం వడ్డిస్తానంటే

"అమ్మా, నువ్వే కలిపి పెట్టు.. అలాగయితేనే టేస్టీగా ఉంటూంది.. ఎందుకో మేము ఎంత బాగా కలిపినా నువ్వు కలిపినట్టు ఉండదు.. ప్లీజ్.." అన్నారు ఇద్దరూ.. నవ్వుతూ కలిపి పెట్టింది.

ఆత్రంగా ఎంతో ఇష్టంతో తింటున్నపిల్లలిద్దరినీ చూస్తే ఎంతో ముద్దు వచ్చింది సునీతకి.

"హోం వర్క్ చేసేసుకున్నాం అమ్మా "అని మున్నీ చెప్పింది.

"అంతే కాదు రేపటి అసైన్‌మెంట్‌కి కూడా నేను ప్రిపేర్ అయిపోయాను అమ్మా" అంటే అప్రయత్నంగానే ఆ మె కి నవ్వు వచ్చింది.. అవన్నీ ఒకసారి చెక్ చేసింది.

"అమ్మా నెకెప్పుడూ కోపం రాదా? అంటుంది మున్నీ.. "

"మాదో రిక్వెస్ట్.. నువ్వు వండినట్టు మరెవరూ వండలేరు.. అమ్మా ప్లీజ్ డోంట్ హైర్ ఏ కుక్.. నీకే హెల్ప్ కావాలన్నా మేం చేసేస్తాం.. కాని కుక్ మాత్రం వద్దు మనకి.. అమ్మ వంటే బావుంటుంది.. నిజంగా నిజం.. నువ్వు నిన్న లిల్లీ ని అడుగుతుంటే విన్నాను నేను.. " అన్నాడు వినయ్. చేసినా చెయ్యకపోయినా పెద్ద కబుర్లు మాత్రం చెప్తాడు.

' చాలా హెక్టిక్ గా అనిపిస్తోంది ఈ మధ్య.. అందుకే అడిగింది లిల్లీని.. వీళ్ళు వినేసారన్నమాట ' అనుకుంది.

"అవునమ్మా, నేను మధ్యాహ్నం ఉల్లిపాయ పొట్టు తియ్యడం ప్రాక్టీస్ కూడా చేసాను.. నీకు రోజూ చేసేస్తాను, కానీ ప్లీజ్ కుక్ మాత్రం వద్దమ్మా" అంది.

వాళ్ళ మాటలకి పక పకా నవ్వింది, మనసు తేలిక పడేలా, కళ్ళల్లోకి నీళ్ళొచ్చేంతలా నవ్వింది సునీత.

భోజనం చేసి ఒక అరగంట చదువుకుని శ్రీధర్ రాగానే హాయ్ చెప్పి నిద్రపోయారు.

"అమ్మా, అన్నం వద్దన్నాను కానీ.. సాంబార్ వజ్ డెలిషియస్.. " అన్నాడు వినయ్.

"అమ్మా బీరకాయ కూర కూడా అంతే.. యమ్మీ.. "అంది మున్నీ.. రగ్గులిద్దామని వెళ్ళినప్పుడు తన చేతులు పట్టుకుని చెప్తున్న పిల్లల ఆ మాటలు విని పొంగిపోయింది. పొద్దున్నించిపడిన కష్టాన్ని మరిచిపోయింది.

మరీ డ్రామా చేస్తున్నారు.. ఇంక పడుకోండి.. గుడ్ నైట్ , నవ్వుతూ అంది ఇద్దరికీ రగ్గులు కప్పుతూ.

"వాళ్ళన్నది నిజమే సునీ! నీ చేతి వంట తిన్నాకా నాకు కూడా ఇంకెక్కడా తినాలనిపించదు.. ఈ రోజు మీటింగ్ అయ్యాకా డిన్నర్ కూడా చెయ్యకుండా వచ్చేసాను తెలుసా, చిటికెలో స్నానం చేసి వచ్చేస్తాను.. మనం కూడా భోంచేసేద్దాం " అన్నాడు శ్రీధర్ ప్రేమగా ఆ మె కళ్ళల్లోకి చూస్తూ.. ఆ మాటలకి ఆమె మనసు మురిసిపోయింది.

------------

"ఇయ్యేల కూడా నీసొండలేదా? నాకక్కరలేదీ కూడు.. " గట్టిగా కేకలేస్తున్న తండ్రిని కోపంగా చూశాడు రాము.

"ఈ రోజు నెలాఖరు కదా, రేపట్టుకొస్తాలే అమ్మగారిచ్చేత్తానన్నరు డబ్బు అంది అనునయిస్తున్నట్టుగా.

"రెండు రోజులకోసారి ఇదే గోల.. "అని విసుక్కుంటూనే కంచం ముందుకొొచ్చాడు. బాధగా నిట్టూర్చింది చిన్నమ్మ. అప్పటికింకేమీ గొడవ జరగనందుకు సంతోషించింది కూడా.

"అమ్మా, అమ్మగారి వంటావిడకేమీ వంటే రాదు.. కొంచం తొక్కుంటే వెయ్యమ్మా" అన్నాడు రాము అన్నం కలుపుతూ ..

"అవునమ్మా రాము గాడిన్నాళ్ళకోమాట సరిగ్గా చెప్పాడే అమ్మా.. నాన్నని సూడు.. పులుసెలాతాగుతున్నాడో.. "అంది నవ్వుతూ..

అలా అంటూనే.. "నువ్వు సంటిని సూడమ్మా, నేను గిన్నెలన్నీ కడిగేస్తాగా.. పొద్దున్నకెండిపోతాయి మళ్ళీ.."అంటున్న కూతురిని ప్రేమగా చూసింది చిన్నమ్మ.

"రేపు నేనిస్కూల్నించి తొందరగా ఒచ్చేత్తా, నువ్వోగంట పడుకుని అప్పుడెల్లచ్చు బంగళాలో అమ్మగారింటి పనికి "అంది కూడా..

"రేపు నీళ్ళు నేను తెత్తానమ్మా" అన్నాడు రాము.. ఇద్దరి బుగ్గలూ నిమిరింది ముద్దుగా చిన్నమ్మ.

మరో పది నిమిషాల్లో బొతలు పరుచుకుని నిద్రపోయారు వాళ్ళిద్దరూ.. వాళ్ళనే ప్రేమగా చూస్తూ కూర్చుంది చిన్నమ్మ

-----------

చేతులు కడుక్కుని వచ్చి పాపని కాసేపు వళ్ళో కూర్చోబెట్టుకుని అత్తగారితో మాట్లాడింది.

తర్వాత స్నానం చేద్దామని వెళ్ళింది విభావరి.. గత ఆరునెలలుగా కంపెనీ అమ్మకాలు పెద్ద గొప్పగా లేవు.. ప్రస్తుతం ఉన్న పరిస్థితులలో ఆశాజనకంగా కూడా లేవు.. ఇలాంటి పరిస్థితిలో ఎంతో కష్టపడితేనే కాని సరిఅయిన ప్రణాళిక రాదు.. దానికి తోడు రాజీవ్ కొత్త వెంచర్ తో బిజీ.. ' చాలా స్ట్రెస్ ఫుల్‌టైంస్' అనుకుంది.

వేడి నీళ్ళు షవర్‌లోంచి జాలువారుతుంటే టెన్షన్ మరిచిపోయే ప్రయత్నం చేసింది.. ఎంత ఆఫీస్ పని అక్కడే వదిలేద్దామనుకున్నా అవదు.. అనుకుంది విసుగ్గా.. ఇందాకా సమావేశంలో వేసుకున్న ప్రణాళికలూ, దానికొసం వేసుకున్న గ్రాఫ్‌లూ, చార్ట్‌లూ మెదడంతా తిరుగుతూనే ఉన్నాయి. కొన్ని వందలమంది జీవితాలు తమ నిర్ణయాలమీద ఆధారపడి ఉంటాయి.. అలాంటప్పుడు ఏ చిన్న తప్పటడుగు వేసినా కూడా ప్రమాదమే.. బాధ్యత బరువనిపించినా అది నిర్వర్తించాకా వచ్చే ఆనందం ఎంతో తేలికగా హాయిగా ఉంటుంది.. అప్పటివరకూ ఇవన్నీ తప్పవు. అలసటగా బయటకి వచ్చింది.

పాపకి నిద్ర వస్తున్నట్టుంది.. అత్తగారి చేతిలోనించి పాపని తీసుకుని మంచమ్మీద వాలింది.. మెల్లగా జోకొట్టసాగింది.. తెల్లగా రబ్బరు బొమ్మలా ఉంది పాప.. చిన్న చిన్న గులాబీ మొగ్గల్లాంటి చేతులు.. మొహమ్మీద తప తపా కొట్టింది.. బెడ్ లైట్ చూస్తూ ఊ, ఊహూ అంటూ కబుర్లు చెప్తోంది.. నల్ల టి జుట్టు చిన్న నుదిటి మీద పడి ఏ.సీ గాలికి మెత్తగా పట్టులా ఊగుతోంది. నిన్న కాక మొన్న తమ జీవితంలోకి వచ్చిన ఈ చిన్నారిని చూస్తేనే ఎంత కష్టమైనా మరిచిపోగలరు తనూ, రాజీవ్..

పాపని దగ్గరగా హత్తుకుని మెత్తగా జోకొట్టసాగింది.. నిద్రలోనే పాప కిలా కిలా నవ్వింది. బోసి నవ్వు చూస్తూనే మురిసిపోయింది. విభావరి.

----------

అలా నగరం నిద్రపోయింది. ఆకాశంలో నగర సంచారం చేస్తున్న చందమామ మాత్రం వీళ్ళందరినీ చూస్తూ కులం, మతం, వయసు, చదువు, అందం, ఆస్థి, అంతస్థులకి అతీతమైనదే కదా అమ్మ ప్రేమ. పిల్లలపెదవుల మీద విరిసే చిన్న చిరునవ్వుతోనూ, ప్రేమించేవారి నోట వచ్చే ఒక చిన్న మాటతోనూ పడిన శ్రమని మరిచిపోయేంత అల్పసంతోషి అమ్మ కాక ఎవరు? అందుకే ఏ ఇంట్లోనైనా అమ్మ ఒకటే.. అనుకున్నాడు అలా అనుకోగానే అతనికి అమ్మ గుర్తొచ్చింది.. పక్కనే అల్లరిగా తిరుగుతున్న స్నేహితుడు మేఘుడిని అడ్డురమ్మని గబగబా అమ్మదగ్గరికి పరిగెత్తాడు అందాల జాబిల్లి. ఇప్పుడు ఆ కాశం కూడా నిద్రపోతున్నట్టుగా ఉంది.

●●●

Click here to share your comments on this story